# వలపు బిచ్చగాడి వయ్యారాలు

వ్రేపల్లెలో ఆమె అడుగుపెట్టి రెండు నిండు చందమామలు గడిచాయి.

మధూలికను వ్రేపల్లెలో గోపయ్యగారి పెద్దబ్బాయికి నిశ్చయమైందన్న ప్పుడే ఆ వూళ్లో గుసగుసలు మొదలయ్యాయి.

అమ్మాయిని నీళ్ల లేని వూరికిస్తే... వూరికి కోసెడు దూరం వున్న ఏటినుంచి నీళ్ల తెచ్చుకోవడం భారం కాదు. గౌరవ దూరం కాదు. లేదూ - కొండకట్టెలు కొట్టి తెచ్చుకుని యింట్లో పొయ్యి రాజెయ్యాలనే పేదసంసారికిచ్చినా ఫరవాలేదు. అది కష్టం కాదు. గౌరవహానీకాదు.

నలుగురత్తగార్లు - పోరుపెట్టే ఆడబిడ్డ ఉన్న యింటికి ఒకతే కోడలుగా పంపినా ఆట్టే భయం లేదు పరువుహీనం కాదు. లేదూ పదామడ దూరం చీమలు దూరని చిట్టడివి, కాకులు దూరని కారడవి గుండా నడిచి అత్తారింటికి వెళ్లాల్సిన వూరి సంబంధమయినా భయమే లేదు. పరువు హానీ కాదు.

కానీ..... కానీ... వ్రేపల్లె సంబంధమంటే! ......... అబ్బో! భయం!... భయం....

ఎందుకు?

అక్కడ కిష్టయ్య అనే కన్నయ్య నందగోపుడి ముద్దుల కిష్టయ్య ఉన్నాడు.

ఉంటేనేం?

అతడు యశోదమ్మ భయభక్తులలో పెరిగిన వాడే అయినా రాధ పెంపకంలో రాటుదేలిన మగవాడు.

అతడ్ని చూస్తే మనసే కాదు కాలూ నిలవదు. మనసు పారేసుకుని కాలుకాలిన పిల్లిలా యిల్లిల్లూ తిరగాలి. వెయ్యిళ్ల. కాదు. కాదు... పదారువేల యిళ్ల పూజారి... ఎక్కడుంటాడో... ఎప్పుడొస్తాడో.... ఎక్కడికొస్తాడో... అనుకుంటూ అడుగుల్లో అడుగు వేసుకుంటూ ఆర్తితో అతగాడిని వెతుక్కుంటూ వెళ్లాలి.

అయితే ఇంత గొడవా మధూలిక తేలిగ్గా కొట్టి పారేసింది. అబ్బో గిరిని ఎత్తిన మగాడయినంత మాత్రాన మనసు పారేసుకోవాలా అనుకుంది. మనువాడిన వాడిని విడిచి అతడివెంట పరుగెత్తాలా అనుకుంది.

పెళ్లై - అత్తారింటికి వచ్చాకే తెలిసింది.

తన మొగుడు పెద్దబ్బాయి.... అతన్నంతా అలాగే పిలుస్తారు.. పేరేంటో తెలియదు.. ఎవరూ పిలవరు పేరెట్టి... ఆ పెద్దబ్బాయి నందుడిగారి ముద్దబ్బాయి కిష్టయ్యతో పాటే గోవులు కాసేందుకు జతగా వెళ్లేవాడని.. చిన్నప్పుడు వద్దన్నాలు పూరగాయలు ఆయన గారితో పాటే ఈయనగారూ తెగమెక్కేవాడని.

అంతగా మమేకంగా తిరిగినా ఈయనకి అంటనివి రెండే రెండు గుణాలు...

ఒకటి-గుండె జల్లుమనేలా వేణువు పూదడం వేణువు పూదుతూ వుంటే వెంటొచ్చిన అమ్మాయిని వెన్ను వెంటేసుకుని వంశీకుంజాలవెంట తిరగడం...

అవి తెలిసిన మధూలిక మనస్సు ఒకరకంగా భారమైంది. గుండె వెరువైంది. మనసు పూయలలూగేలా వేణువు పూదడం రాదంటే గుండె గుభిల్లు మంది. కానీ ఏ పడతినీ కన్నెత్తి చూడడు పన్నెత్తి పలుకరించడు అన్నపుడు మాత్రం గుండె తేలికపడింది.

కాపురానికొచ్చిన కొత్తల్లో పొద్దుకూకగానే వెన్నెల బయళ్లకి పరెగెత్తే మొగుడిని ఎలా ఆపాలో తెలియక ఆరాటపడినా... ఆ తర్వాత లాలించి పాలించి మురిపాల తేలించి చీకటి పడగానే పందిరి మంచ మెక్కేలా చేయగలిగింది. చేసింది.

సుఖమంటే ఏమిటో తెలియని మొద్దబ్బాయి పెద్దబ్బాయికి పెద్దబాల శిక్ష నేర్పినట్టు అన్నీ నేర్పింది. మప్పింది, నేర్పరిని చేసింది. ఆమె తీర్పులో ఆరిందా అయ్యాడు మొద్దబ్బాయనుకున్న పెద్దబ్బాయి.

ఆ నోటా ఆనోటా మధూలిక అందాలు చందాలు కిష్టయ్య చెవిన పడనే పడ్డాయి. ఊరికొచ్చిన కొత్త కోడలిని ఆమె అందాలని చూడందే మనసొప్పుకోలేని కిష్టయ్య ఓ రోజు పనిగట్టుకుని వీధి వెంటబడి వచ్చాడు.

ఇలవేలుపులాంటి కిట్టయ్య ఇంటికే వచ్చేస్తే పెద్దబ్బాయికి వాళ్లయ్య గోపయ్యకి కాళ్లాడలేదు.

మనసాడలేదు.

మాటారాలేదు.

వెన్నముద్దలు తినిపించి, కాచి చల్లార్చి పాలు తాగించి చెప్పలేనంత గౌరవం చేశారు. తమ జన్మ ధన్యమై పోయినదన్నంతగా తన్మయత్వంతో దాసాను దాసుల్లా సేవించారు.

తలుపు చాటునుంచి కిట్టయ్యని చూసిన మధూలికకు మతిపోయింది!

ఆ నీలమేఘశ్యాముని అపురూప సౌందర్యం ఆ మగటిమి ఆ ఠీవి ఆ సుకుమార తనువు చూసి మనసు పారేసుకుంది. ఆగలేక ఆరడికి ఓపలేక యీవలి కొచ్చింది. తలుపువాటు నుంచి తనంత తాను ఎదురుగా వచ్చి కనులారా గోగోపబాలుని నిండారు సొగసు చూసింది.

కిష్టుని కళ్లు యమునంత అయ్యాయి.

విహార్చుకుని మధూలిక సౌందర్యాన్ని కళ్లనిండా నింపుకున్నాడు. పదహారు వేలమంది గోపికల్లో.... ఎనిమిది మంది భార్యల్లో ..... రాధలో... లేని విలక్షసౌందర్యం విశ్వం పట్టని అందం చూసి వియత్తలం వేరే ఆ సోయగం చూసి కృష్ణుని మనస్సు రెపరెపలాడింది అది ఒక్క క్షణమే.

అయితే......

ఆరి తేరిన మగాడు కాబట్టి, అనుభవజ్ఞుడు కాబట్టి మనస్సు నిగ్రహించుకున్నాడు. మాటల్లో కానీ చూపుల్లో కానీ తబ్బిబ్బులు లేకుండా జాగ్రత్త పడ్డాడు.

కానీ మధూలికే మై మరిచింది.

మరిచిన మత్తులో సైగ చేసింది.

ఆ రాత్రి తన అందం అందానికి పదింతలై అలరించేలా సింగారించుకుని, బంగారు సామికి తన తనూ బంగారం సింగారించాలని ఆశపడింది.

వేచి వేచి ఎదురు చూడసాగింది.

ఒక జాము, రెండో జాము, మూడో జామూ కూడా ముచ్చటగా గడిచి పోయింది.

ప్రతి నిమిషం పరువాల పండుగగా ఊహించుకున్న మధూలికకు ప్రతి నిమిషం ప్రాణ గండంగా గడిచింది. తన నవయవ్వనాన్ని నైవేద్యం చేసి తన తనూయమునా లహరుల్లో ఓలలాడించాలని వువ్విళ్లూరిన పడతికి నిరాశే ఎదురైంది.

వేగుచుక్క పొడిచింది

ఆయన రాక రాకంతా వ్యర్థమై పోయింది.

అరసుడ్ని (రాజా) నమ్ముకుని పురుషుడ్ని దూరం చేసుకున్నాను ఒక్క పొద్దు ఒక్కపొద్దులా గడిచింది అని వుస్సురంది.

లోపలికి వెళ్లి పడకగదిలో ఆదమరిచి నిదురించే పతి ఎదమీద వాలిపోవాలనుకుంది.

అంతలో -

వీధి చివర - మందహాసంతో మందగమనంతో నల్లనయ్య.

అతన్ని చూడగానే ఆగ్రహం పెల్లుబికింది. అధరం చీలి రెండయ్యేలా ముద్దాడాలన్నంత కసి.

వెక్కిలి గాటయ్యేలా కాటెయ్యాలన్నంత ఆత్రం..... వళ్లంతా విరిగి పోయేలా కౌగిలించుకోవాలన్నంత మోహం.

కానీ వేగు చుక్క వేగిరి పాటు - తూరుపు తెల తెలలు ఆపేని ఆపేశాయి.

అయితే ఆక్రోశం మాటల్లో పొంగింది.

దగ్గరికి వచ్చాడు.

రాగానే మూతి ముడిచింది.

ఎటో చూస్తూ - ఎదలోని వేదన పదపదాన అక్షరాక్షరాన ప్రకటితమయ్యేలా అంది.

విన్నవే యిన్నాళ్ల.......

కన్నులారగ మాసినాను.. నేడు ఎంతో ఆనందమాయె

ఆ చందనాంకములు ఆ తమ్మంపు ముద్రలు ఏవేమొ చెప్పలేరు తామె..

వేయి పైనాయె ప్రియురాంద్రు

రేయికో - మూడే యామములాయె...

మోహయాత్ర నెదో యీ దారి నూరేగుచు

ఉబుసుపోక -

వేంచేసినార లీ వేగుబోక

వలదు విడియగ -

ఇట మానవతులె కాని -

వలపుబిచ్చ మాశించెడు వారు లేరు

పిలుచు చున్నవి వేరె కౌగిళులు వెడలు...

(అనుచు తెగనాడె ఖండిత యైన నారి)

ఆహా - ఏం రసికుడి వయ్యా నల్లనయ్యా!

ఆశపడ్డందుకు తగిన శాస్తి వేశావు.

ఇన్నాళ్లూ ఈ ముచ్చట్లు విన్నవే.....

కానీ యీ రోజు కన్నులారా చూశాను.

చాలా ఆనందమైంది ప్రభూ !

ఏదో పేదరాలిని ఆశపడ్డాను. అంతేకానీ - మీ రాణువల్లో నేనెన్నో దాన్ని... ఎన్నికైన వాళ్లే ఎనమండుగురు. వెంట పడే వాళ్లు పదారువేలు.

ఏ యింటి విడిదిచేశారు తమరు?

ఆ చందనం పూసింది ఎవరో!... ఆ అధరం మీద తాంబూలపు ముద్ర ఎవరిదో!... మీరే చెప్పలేరు కదూ!

పదారువేల పైబడిన యిళ్ల పూజారులాయె తమరు.

పాపం.. రాత్రికి మూడే జాములుంటాయి (తొలి జాము తమ లీలలకి వీలు కాదు కదా స్వామీ!) పదహారు వేలుంటే ఎంత బావుండేది....

మీ మోహయాత్రలో ఏ దారిలో వూరేగుతూ ఈ దారిని వచ్చారు తమరు?

ఏదో ఉబుసు పోకకు వచ్చారేమో!

ఇక్కడ వలచిన చిన్నదే తప్ప మోహితులు వ్యామోహితులు లేరు. వెళ్లిరండి స్వామీ!

క్షణం సేపు తీరికగా బడలిక తీర్చుకుని వెళ్లాలని అనుకుంటున్నారేమో!

ఇక్కడ మానవతులున్నారే కానీ వలపు బిచ్చము ఆశించే వాళ్లెవరూ లేరయ్యా స్వామీ.... వెళ్లండి తమరు...

వెళ్లండి! వెళ్లిరండి! మీరు కౌగిలిస్తే అదే కైలాసంగా... ముద్దిస్తే అదే మోక్షంగా.. భావించే వాళ్లున్నారు వెళ్లండి! వెళ్లండి!

గద్గదికంగా... ఏడుపుని ఆపుకుంటూ.. ఎగిసెగిసి పడుతున్న ఎదసోయగాలతో... నిద్రలేక, కోపంతో ఎర్రబారిన కళ్లతో కసిగా చూసే కనుగాతో.. రతి సామ్రాజ్య రమణీమణిలా, అతనుసంగర విజేతలా కనిపించే మధూలికను ఒకచూపు చూసి... బిగ్గ కౌగిలించి... చక్కా ముద్దాడాడు నల్లనయ్య..

అంతే.... ఆగ్రహం ఆవేశమైంది.

తనువు తనువుతో తలపులు పండేలా తలపడింది.

(శ్రీ దేవుల పల్లి వేంకట కృష్ణశాస్త్రి గారికి కృతజ్ఞతలతో)

* * *